సాక్షి
అనకాపల్లి
శుక్రవారం ◆ 16 ◆ ఆగస్టు ◆ 2024



దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు

విశాఖ: జ్ఞానాపురంలో దేవమాత మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.



జానపద గీతం ఆడియో విడుదల

గాజువాక: నాని నాయుడు రూపొందించిన బంగమూతి పిల్ల జానపద గీతం ఆడియోను జబర్దస్త్ నటుడు సత్తిపండు గురువారం విడుదల చేశారు.



శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం శ్రావణ లక్ష్మి పూజలు, హోమం ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

దేవరాపల్లి కానిస్టేబుల్‌కు ప్రెసిడెంట్ మెడల్



విజయవాడలో సీఎం చంద్రబాబు నుంచి పతకం అందుకుంటున్న వెంకటరమణ

దేవరాపల్లి: పంద్రాగస్టు వేడుకల్లో ఏపీ గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ గొర్లె వెంకటరమణకు అరుదైన గౌరవం దక్కింది. దేవరాపల్లికి చెందిన ఆయన్ను ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ పతకంతో రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది. గురువారం విజయవాడ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం నారా చంద్రబాబునాయుడు నుంచి పతకాన్ని అందుకున్నాడు. 2012లో ఉద్యోగంలో చేరిన వెంకటరమణ 2021లో ఓ ఘటనలో సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ పురస్కారం వరించింది.

అరిటాకులు చుట్టుకుని.. గిరిజనుల వినూత్న నిరసన



సమస్య పరిష్కారానికి అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న అజయ్‌పురం గిరిజనులు

మాడుగుల: మండలంలోని తాటిపర్తి పంచాయతీ అజయ్‌పురం సమస్యల పరిష్కారం కోరుతూ గిరిజనులు గురువారం అరిటాకులు చుట్టుకుని, అర్ధనగ్న ప్రదర్శనతో తమ నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లవుతున్నా కనీస సౌకర్యాలకు దూరంగా గిరిజన గ్రామాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, తాగునీటి కష్టాలు తీరలేదని, విద్య, వైద్య, ఉద్యోగావకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వాపోయారు. నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనులకు ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో డోలీ మోతలు తప్పట్లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కార్లి భవాని, గిరిజన సంఘ సభ్యులు వంతాల కేశవరావు, మచిరాజు పోతురాజు, రాజులమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

రేంజ్ కార్యాలయంలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

సాక్షి, విశాఖపట్నం: స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన సమరయోధులను గుర్తు చేసుకుని, వారి ఆశయాలకు అనుగుణంగా భావితరాలు పనిచేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. విశాఖ జిల్లా పెదవాల్తేరులోని డీఐజీ కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం వేడుకలు ఘనంగా జరిగాయి. డీఐజీ గోపీనాథ్ జెట్టి జాతీయ పతాకావిష్కరణ చేసి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రేంజ్ పరిధిలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేంజ్ కార్యాలయ మేనేజర్ సూర్యారావు, శ్రీకాంత్, సీసీ గణేష్, ఇన్‌స్పెక్టర్‌లు రమణయ్య, ప్రేమ్‌కుమార్, మల్లికార్జునరావు, సతీష్, ఎస్‌ఐ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఆత్మీయ స్వాగతం



గోపాలపట్నం (విశాఖ): సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరికి విశాఖ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం లభించింది. విశాఖలో మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు గోపి, సాయి కల్యాణ చక్రవర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులు ఆయనకు స్వాగతం పలికారు.

సమగ్రాభివృద్ధి దిశగా..

- అరోగ్యకరమైన భవిష్యత్తు వైపు యువత నడవాలి
- గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం
- అందరి సహకారంతో సంక్షేమాభివృద్ధి, శాంతిభద్రతలు
- జెండా ఆవిష్కరణలో రాష్ట్ర హోం మంత్రి అనిత
- ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు





జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం చేస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత, పక్కన కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జేసీ జాహ్నవి, ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల, (ఇన్‌సెట్) పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అనిత

సాక్షి, అనకాపల్లి: యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఈ విపత్తు నుంచి విముక్తి పొంది, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం కృషి చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కోరారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రహితంగా రాష్ట్రాన్ని, జిల్లాను నిలుపుదామని పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా గురువారం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం త్రివర్ణ పతాకానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దీపిక పాటిల్‌లతో కలిసి వందన సమర్పణ చేశారు. పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో పోలీసు దళం మంత్రికి గౌరవ వందనం చేయగా, పోలీస్ బ్యాండ్ జాతీయ గీతాన్ని ఆలపించింది. ఈ సందర్భంగా త్రివర్ణ బెలూన్లను గాలిలోకి ఎగురవేసి, పోలీస్ గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఆకర్షణీయమైన సువిశాల సముద్రతీరంతో పాటు మైదాన, గిరిజన, పారిశ్రామిక వాడలతో సమ్మిళితమై, అభివృద్ధి దిశగా దూసుకెళుతోందన్నారు. ప్రశాంతతకు మారుపేరైన అనకాపల్లి జిల్లాలో ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తూ, అన్ని రంగాల్లో సమగ్ర పురోగతిని సాధించాలని ఆకాంక్షించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు పోరాటం చేసిన జిల్లా, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జన్మించిన నేల మన అనకాపల్లి అని కొనియాడారు. బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా మేము సైతం అంటూ జిల్లాలో 391 మంది పోరాటంలో నిలిచి, స్వాతంత్ర్య సమరయోధులుగా జైలుకు వెళ్లిన విషయాన్ని సగర్వంగా గుర్తు చేశారు. గొంప గ్రామం నుంచి భూపతిరాజు సత్యన్నారాయణరాజు, పోతవలస నుంచి టేకుమళ్ల సీతారామస్వామి, మాడుగుల నుంచి కామయ్య, రంగారావు, ఇంద్రగంటి వెంకటేశ్వరరావు, వడ్డాది నుంచి దాడి రామమూర్తి, మంచిబొట్ల నరసింహమూర్తి మొదలైన ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు ఉండటం ఈ ప్రాంతానికెంతో గర్వకారణమని కొనియాడారు. అలాంటి త్యాగమూర్తులందరికి శిరస్సు వంచి అంజలి ఘటించారు.



జాతీయ భావాన్ని పెంపొందించే సాంస్కృతిక ప్రదర్శన





విన్యాసాలు, యోగాసనాలతో అలరిస్తున్న విద్యార్థులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 11 విద్యార్థి బృందాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతుల్ని అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలలో కొక్కిరాపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, తానాం ఎంజేపీఏపీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ, కశింకోట జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి, మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

194 మందికి ఉత్తమ సేవా పురస్కారాలు

జిల్లాలోని వివిధ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎస్పీ దీపిక పాటిల్‌లతో కలిసి హోం మంత్రి వంగలపూడి అనిత అందించారు.

ఆకట్టుకున్న ప్రభుత్వ శాఖల స్టాళ్లు

జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి సంస్థ, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, పాఠశాల విద్య, సమగ్ర శిక్ష అభియాన్, జీవీఎంసీ, మెప్మా, అటవీశాఖ, ఉద్యానవన శాఖ, ఏపీఎంఐపీ, ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వీటిని మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ రమేష్, జేసీ జాహ్నవి సందర్శించారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీఆర్వో వై.శ్రీనివాసరావు, ఆర్డీవో చిన్నికృష్ణ, సీపీవో రామారావు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు జాతీయ పతాకావిష్కరణ మహోత్సవంలో పాల్గొని, వందన సమర్పణ చేశారు.



వ్యవసాయ రంగ పురోగతిని వివరిస్తున్న అధికారి



పశుసంవర్ధక శాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి

పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): కేకే లైన్లో, నౌపడ-గుణుపూర్ లైన్లలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ప్రక తెలిపారు. విశాఖ-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ గురువారం నుంచి 21వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ (08552) పాసింజర్ స్పెషల్స్ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

విశాఖ - కిరండూల్(18514)నైట్ ఎక్స్‌ప్రెస్ గురువారం నుంచి 21వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ (18513) ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

ఈ తేదీల మధ్య దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. ఎస్‌జీ (నౌపడ-గుణుపూర్) లైన్ పరిధిలో ఆగస్టు 17వ తేదీన ట్రాఫిక్ బ్లాక్స్ తీసుకుంటున్నందున విశాఖ-గుణుపూర్ రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

17న విశాఖ-గుణుపూర్-విశాఖ (08522/08521) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు శ్రీకాకుళం రోడ్ వరకే నడుస్తాయి. ఆరోజు శ్రీకాకుళం రోడ్-గుణుపూర్ మధ్య ఈ రైళ్లు నడవవు.

విశాఖ చేరుకున్న రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి

మహారాణిపేట (విశాఖ): రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ, రిజిస్ట్రేషన్) రామ్ ప్రకాష్ సిసోడియా గురువారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకుని అక్కడే బస చేశారు. శుక్రవారం విజయనగరం జిల్లాకు వెళ్లి.. సాయంత్రం ఆరు గంటలకు తిరిగి విశాఖ వస్తారు. అనంతరం పోర్టు గెస్ట్‌హౌస్ వద్ద ఫిర్యాదులు స్వీకరిస్తారు. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహిస్తారు.

నేటి నుంచి జూడాల సమ్మె



కేజీహెచ్‌లో ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట (విశాఖ): కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య నేపథ్యంలో నిరసనగా జూనియర్ వైద్యులు, విద్యార్థులు ఆందోళన ఉధృతం చేయాలని నిర్ణయించారు. శుక్రవారం నుంచి కేజీహెచ్‌లో సమ్మె చేస్తున్నట్టు ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.పృధ్వీరాజ్ ప్రకటించారు. అత్యవసర సేవలకు కూడా దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆర్‌కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తమ ఆందోళనకు అన్ని సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇదిలావుండగా గురువారం జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించారు. ఆస్పత్రిలో, మెడికల్ కాలేజీలో నిరసన ప్రదర్శన చేశారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ పృధ్వీరాజ్, ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లం'ఘనులు'



కోడ్ ఉల్లంఘిస్తూ వేదికపై కూర్చున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల

- స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి ఒక్కరికే అనుమతినిచ్చిన ఈసీ
- కానీ అనకాపల్లి ఎంపీ, ఎమ్మెల్యే కూడా హాజరు
- మంత్రితోపాటు అవార్డులు అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యే
- శకటాలకు ని'బంధనాలు'.. ప్రజా ప్రతినిధులకు కోడ్ లేనట్టేనా?

సాక్షి, అనకాపల్లి: ప్రజా ప్రతినిధులు స్వాతంత్ర్య దినోత్సవంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ అమల్లో ఉన్న విషయం విదితమే. గురువారం అనకాపల్లి క్రీడా మైదానంలో కోడ్ ఉల్లంఘిస్తూ.. బీజేపీ ఎంపీ సీఎం రమేష్, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉత్సవంలో పాల్గొన్నారు. జెండా పండగలో ప్రభుత్వం నుంచి ఒక ప్రజాప్రతినిధి మాత్రమే పాల్గొనాలని ఈసీ స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా.. అనకాపల్లి జిల్లాలో మాత్రం అది వర్తించలేదు. మంత్రి అనితతోపాటు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వేదికపై కూర్చోవడమే కాకుండా.. ప్రతిభా అవార్డులను కూడా ప్రదానం చేశారు. ప్రజాప్రతినిధులకు ఒక్కరికే అనుమతి ఉన్నట్లు ఈసీ స్పష్టంగా పేర్కొన్నా.. వారు కోడ్ ఉల్లంఘించే సరికి కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జేసీ జాహ్నవి సైతం నివ్వెరపోయారు. కోడ్ ఉల్లంఘన అని తెలిసినా తప్పని పరిస్థితుల్లో వారితో కలిసి ప్రతిభా అవార్డులు అందజేశారు. కోడ్ ఉల్లంఘన పేరిట శకటాల ప్రదర్శనను నిలిపివేసిన కలెక్టర్.. ప్రజాప్రతినిధులు నేరుగా వేదికపైకి వచ్చి కూర్చోవడమే కాకుండా అవార్డులు ప్రదానం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పొరుగున ఉన్న విశాఖ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒక్కరే వేదికను అలంకరించారు. విశాఖ ఎంపీతో సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ వేదిక దిగువనే వీక్షకుల గ్యాలరీలో కూర్చున్నారు. అందుకు విరుద్ధంగా అనకాపల్లి జిల్లాలో ప్రజాప్రతినిధులు నేరుగా వేదికను పంచుకోవడం.. అవార్డులు ప్రదానం చేయడం చూస్తే వీరికి కోడ్ వర్తించదా అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్కెట్‌కు శ్రావణ శోభ

- వరలక్ష్మీ వ్రతం కొనుగోళ్లతో దుకాణాలు కిటకిట
- ఆకాశాన్నంటిన ధరలతో జనం బెంబేలు



పూజాసామగ్రి కొనుగోలు చేసే వారితో కిక్కిరిసిన అనకాపల్లి మెయిన్‌రోడ్డు

అనకాపల్లి: మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడుతోంది. రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో వస్త్ర, బంగారు దుకాణాలతోపాటు పూజా సామగ్రి విక్రయించే షాపులు కిటకిటలాడాయి. నెహ్రూచౌక్, చిన్ననాలుగురోడ్ల జంక్షన్, బండిగాడి వీధి, రింగ్‌రోడ్ కూడళ్లు జనంతో సందడిగా కనిపించాయి. వరలక్ష్మీ వ్రతానికి పూలు, పండ్లు, చీర, రవిక, లక్ష్మీదేవి ముఖచిత్రం కలిగిన బంగారు కాసును కొనుగోలు చేసి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ అన్ని వర్గాల వారు ఆచరించే పూజ కావడంతో ఇసుకేస్తే రాలనంతటి రద్దీ నెలకొంది. కొబ్బరికాయ ధర రూ.40-50లు పలికింది. చామంతి పువ్వులు పది రూపాయలకు మూడు ఇవ్వడంతో భక్తులు గగ్గోలు పెట్టారు. డజన్ అరటిపండ్లను సైజును బట్టి రూ.50 నుంచి 130లకు విక్రయించారు. రెండు యాపిల్ పండ్లు రూ.100, బత్తాయిలు మూడు రూ.100 చెప్పడంతో ఏం కొంటాం, ఏం పెట్టి పూజిస్తాం అని భక్తులు వాపోయారు. కాసు బంగారం ధర రూ.6 వేలు ఉండగా, అమ్మవారి ముఖచిత్రం కలిగిన పూతకాసు ధర రూ.1500 నుంచి 2 వేలు పలుకుతుంది. చిన్న పువ్వుల దండ ధర రూ.100లు ఉండగా, ఒక మాదిరి పెద్ద దండ కావాలంటే కనీసం రూ.250లు వెచ్చించాల్సిన పరిస్థితి.

వస్త్ర దుకాణాల్లో రద్దీ

అమ్మవారికి కొత్త చీర, రవిక పెట్టి పూజ చేయడం ఆనవాయితీ కావడంతో వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న అనకాపల్లి పట్టణంలో విశాఖకు దీటుగా వస్త్ర దుకాణాలు వెలిశాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడకు వచ్చి అమ్మవారికి చీరలు, జాకెట్లు కొనుగోలు చేశారు. పట్టణ పరిధిలో రెండు రోజుల్లో సుమారు రూ.రెండు కోట్ల లావాదేవీలు జరిగినట్టు అంచనా.



వస్త్రదుకాణాలు కిటకిట



అనకాపల్లిలో రద్దీగా ఉన్న బంగారు దుకాణం

బంగారు దుకాణాలు కళకళ

ప్రధాన మెయిన్‌రోడ్డులో పెద్ద పెద్ద బంగారు దుకాణాలు ఏర్పాటు చేయడంతో చిన్న దుకాణాలు బోసిపోయాయి. పెద్ద దుకాణాలు శ్రావణమాసం ఆఫర్లు పెట్టడంతో కొనుగోలుదారుల వద్ద ఉన్న కొద్దిపాటి పాత బంగారాన్ని ఇచ్చి కొత్త బంగారు వస్తువులను కొనుగోలు చేశారు. రెండు రోజుల వ్యవధిలో పెద్ద దుకాణాల్లో సుమారు రూ 3.5 కోట్ల లావాదేవీలు జరగగా, చిన్న దుకాణాల్లో రూ.కోటి వరకు అమ్మకాలు సాగాయి.

దడ పుట్టిస్తున్న ధరలు

12 సంవత్సరాలుగా వరలక్ష్మీదేవి వ్రతం చేస్తున్నానని, అప్పట్లో రూ.1500 వెచ్చిస్తే పూజ పూర్తయ్యేదని, ప్రస్తుతం వరలక్ష్మీదేవి పూజకు రూ.10 వేల నుంచి 12 వేలు ఖర్చవుతోందని అనకాపల్లికి చెందిన అన్నపూర్ణ అనే కొనుగోలుదారు చెప్పారు. కిరాణా సామగ్రి, కూరగాయలు, బంగారం, వస్త్రాలు.. ఇలా అన్ని రకాల వస్తువుల రేట్లు భారీగా పెరిగాయన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



అనకాపల్లిలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో హోం మంత్రి అనిత చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న అధికారులు ఎడమ నుంచి వరుసగా.. అనకాపల్లి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి ఎస్.గోపాలకృష్ణ, ఏడీ డబ్ల్యూడీపీటీజీఎస్‌సీ అధికారి జగదీష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్, డీసీఎస్‌ఓ కె.వి.ఎల్.ఎన్ మూర్తి, సివిల్ సప్లయి డీఎం పి.జయంతి, డీఎల్‌డీఓ అధికారి మంజులవాణి, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, డీపీఆర్‌పీ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, డీఎఫ్‌ఓ జి.లక్ష్మణ్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు, డ్వామా పీడీ ఇ.సందీప్, డీజీపీఓ శిరీషరాణి



ద్వితీయ బహుమతి పొందిన తానం ఎంజేపీఏపీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ బాలికలు



తృతీయ బహుమతి కశింకోట జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు



సాంస్కృతిక ప్రదర్శనలో మొదటి బహుమతి పొందిన కొక్కిరాపల్లి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు



కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగరవేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్,

అమరవీరుల త్యాగ ఫలం స్వాతంత్య్రం

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- కలెక్టరేట్‌లో జాతీయ జెండావిష్కరణ

తుమ్మపాల : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన జెండా వందనం కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్ జాతీయ జెండాను ఎగరవేసి త్రివర్ణ పతాకానికి వందనం సమర్పణ చేశారు. అందరికీ 78వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి స్వాతంత్య్ర పోరాటంలో అమరవీరుల త్యాగాలు, దేశభక్తి భావాలపై మాట్లాడారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, జిల్లా ఇంచార్జి డీఆర్వో శ్రీనివాసరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, వివిధ విభాగాల జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులకు స్వీట్లు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

షార్ట్ ఫిలిం పోటీలో బహుమతులు

ఎస్.రాయవరం : జీవవైవిధ్యం సంరక్షణలో యువత పాత్రకీలకం.. అనే అంశంపై నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో కొరుప్రోలు ఉన్నత పాఠశాల విద్యార్థికి జిల్లా ప్రథమ అవార్డు వచ్చినట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఆగస్టు 15 వేడుకలు పురస్కరించుకుని గురువారం రాష్ట్ర హోంమంత్రి అనిత చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నట్టు చెప్పారు. ఏపి బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో విద్యార్థులు అవినాష్‌కుమార్, జ్యోతిప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నట్టు చెప్పారు.



హోంమంత్రి చేతుల మీదుగా అవార్డులు తీసుకుంటున్న కొరుప్రోలు పాఠశాల విద్యార్థులు

5వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న నాన్ షెడ్యూల్ గ్రామాల గిరిజనులు

చోడవరం: నాన్ షెడ్యూల్ ఏరియాను 5వ షెడ్యూల్‌లో చేర్చితేనే, మైదాన గిరిజనులకు నిజమైన స్వాతంత్య్ర వచ్చినట్టు అని ఏపీ ఆదివాసీ హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. కల్యాణ్ ఆదివాసీ తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రావికమతం మండలం పి. గదబపాలెంలో గురువారం నిరసన ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్‌లో చేర్చడానికి అర్హత ఉన్న గ్రామాలను 1976లోనే 800 రెవెన్యూ ఆదివాసీ గ్రామాలు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నట్టు గుర్తించారన్నారు. 1980లో వాటిని షెడ్యూల్ ఏరియాలో కలపాలని అప్పటి సీఎం జలగం వెంకళరావు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారన్నారు. అప్పట్లో ప్రతిపాదనలతోనే నిలిచిపోయిన ఈ సమస్య నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు దేముడు, కల్యాణ్, నాగు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల తిరంగా ర్యాలీ



పట్టణంలో జాతీయ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు

అనకాపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానం నుంచి పట్టణంలోని పలు పురవీధుల గుండా దివ్యాంగులు జాతీయ జెండాను చేతబట్టి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్య్ర సమర యోధుల త్యాగ ఫలితంగా ఈ రోజు ఈ వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సరైన ప్రోత్సాహం అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు భానోద్, దిలీప్, అప్పికొండ శివ, గ్రంధి శ్రీనివాసరావు, రవి, చందనాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ముగ్గురు అరెస్టు



స్వాధీనం చేసుకున్న బాటిళ్లతో ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 124 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలివి. మండలంలోని మూలపేట, రాజుపేట, ఒంపోలు, యాదగిరిపాలెం గ్రామాల్లో మద్యం అమ్ముతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఎస్‌ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో మద్యం అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి 124 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ప్రసాదరావు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు



ఎస్పీ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎస్పీ ఎం.దీపిక



సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎస్పీ

అనకాపల్లి : ఎంతోమంది త్యాగధనుల పోరాటాల ఫలితమే నేటి స్వాతంత్య్రం అని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. శంకరం పంచాయతీ బట్లపూడిగ్రామం తమ కార్యాలయంలో గురువారం పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండాను ఆమె ఆవిష్కరించారు. ప్రతి వ్యక్తి దేశభక్తి పెంపొందించుకోవాల కోరారు. అంతకుముందు పోలీస్ వందనాన్ని స్వీకరించి, సిబ్బందికి స్వీట్స్ పంపిణీ చేశారు.

ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్య వైశ్య పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు



విద్యార్థినికి ఉపకార వేతనాలు అందిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి గోపిశెట్టి మనోహర్

అనకాపల్లి : విద్యా వేతనం పొందే విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి కృషి చేయాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి గోపిశెట్టి మనోహర్ అన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అనుమాలిశెట్టి వెంకటరాజు కల్యాణ మండపంలో గురువారం వంద మంది ఆర్య వైశ్య పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. అంతకుముందు కన్యకా పరమేశ్వరికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో స్వాతంత్య్ర దినోత్సవం



కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా పదోఅదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య

అనకాపల్లి : ప్రతి పౌరుడు దేశ సమగ్రత కోసం కృషి చేయాలని జిల్లా పదోఅదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం త్రివర్ణ జెండాను ఆమె ఆవిష్కరించారు. దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో త్యాగధనులు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. అనంతరం న్యాయవాదులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ రమేష్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షురాలు రోజా పాల్గొన్నారు.

18న నీతి ఆయోగ్ సభ్యుడి రాక

మహారాణిపేట (విశాఖ): నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సరస్వత్ ఈ నెల 18న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం ఆరు గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. 19న రుషికొండలో జరిగే సదస్సులో పాల్గొంటారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు తిరిగి ఢిల్లీ వెళతారు.

జాతిపిత ఆశయ సాధనకు కృషి



రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించిన మాజీ ఎంపీ బీవీ సత్యవతి

- మాజీ ఎంపీ సత్యవతి
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెండా వందనం

అనకాపల్లి: జాతిపిత మహాత్మ గాంధీ వల్లే దేశానికి స్వాతంత్య్ర సిద్ధించిందని మాజీ ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో గురువారం 78వ స్వాతంత్య్ర దిన వేడుకలను పురస్కరించుకుని మాజీ ఎంపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ అహింసా మార్గంలో దేశం మొత్తాన్ని ఒక తాటిపైకి తెచ్చి దేశప్రజల్లో స్వాతంత్య్ర పట్ల చైతన్యాన్ని తీసుకొచ్చారని అన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర మాజీ చైర్మన్ దిలీప్‌కుమార్, ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్, విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు రత్నకుమారి, పార్టీ నేతలు కుమార్‌రాజా, నాగేశ్వరరావు, బొడ్డేడ లక్ష్మీనరసింహ, గైఫూర్ రాజు, పలకా సత్యనారాయణ, బుద్ధ రాజు, శంకరరావు, వేల్పుల గణేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం తీరుపై ఆగ్రహం..



ఎస్.రాయవరం : రేవుపోలవరం పాఠశాలలో పంద్రాగస్టు వేడుకలు

ఎస్.రాయవరం: ప్రజా ప్రతినిధులను అవమానపరచే విధంగా రేవుపోలవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారని మండల వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం జెండా వందనం నిర్వహించారని, ఈ కార్యక్రమానికి స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజా ప్రతినిధులైన తమను ఆహ్వానించకపోగా, ఏ పదవులు లేని టీడీపీ వర్గీయులను పిలిచి జెండా ఎగురవేసే కార్యక్రమం చేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మంచి మనసుతో సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. మరో పార్టీలో ఉన్న ప్రజాప్రతినిధులను అవమాన పరిచేలా కార్యక్రమాలు చేపట్టరాదని చెప్పారు. విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయుడిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



కె.జె.పురంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు



కె.జె.పురంలో ఎన్టీ రామారావు విగ్రహానికి ముసుగు వేయని దృశ్యం



కె.జె.పురం కళావేదిక మీద కూటమి నాయకులతో కూడిన డిజిటల్ బోర్డు

మాడుగుల రూరల్ : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలవుతుంది. ఈ కోడ్‌కు విరుద్ధంగా కె.జె.పురం గ్రామంలో దేశం, కూటమి నాయకులు ఫొటోలతో కూడిన డిజిటల్ బోర్డును స్థానిక కళావేదిక మీద ఏర్పాటు చేశారు. కోడ్ అమల్లో ఉన్నా అధికారులు ఈ బోర్డును తొలగించలేదు. దీంతో పాటు గ్రామంలో గల మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేశారు. ఈ విగ్రహం సమీపంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి మాత్రం ముసుగు వేయకుండా స్వామి భక్తి ప్రదర్శించారు. అధికారుల తీరును స్థానికులు విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

కొండ దిగని కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కొన్ని కూరగాయల ధరలు బెట్టు మీదే ఉన్నాయి. తగ్గుముఖం పట్టలేదు. కిలో వంకాయలు రూ.80, బీన్స్, క్యాప్సికం రూ.100, పాదు చిక్కుడు రూ.120కి విక్రయాలు జరిగాయి. బంగాళాదుంపలు రూ.40 నుంచి రూ.50కి విక్రయించారు. ఉల్లిపాయ, టమాటా రూ.40, బీరకాయ రూ.50, బీట్రూట్, క్యారెట్, చేమ దుంప, గోరు చిక్కుడు, బరబాటి రూ.60, పచ్చిమిర్చి రూ.100, అల్లం రూ.220కి అమ్మకాలు జరిపారు.

పాము కాటు బాధితురాలికి ఆర్థిక సాయం



నిహారిక తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలేనికి చెందిన నిహారిక ఆపరేషన్‌కు సాయానికి రూ.10 సేవా సంస్థ అండగా నిలిచింది. నిహారికకు ఆరు నెలల క్రితం పాము కాటు వల్ల కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకింది. దీనికి ఆపరేషన్ చేయాలంటే రూ.4 లక్షలు అవసరమని వైద్యులు చెప్పారు. అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో సేవా సంస్థను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సంస్థ అధ్యక్షుడు ఏసు బాబు, ప్రతినిధులు ఖాన్, పద్మ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో రూ.20,366 సేకరించారు. ఈ మొత్తాన్ని నిహారిక తల్లిదండ్రులకు గురువారం అందించారు. సేవా సంస్థ ఔదార్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

'రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ'



అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దళితులు

మునగపాక : షెడ్యూల్ కులాల విభజనకు సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సరికాదని దళిత నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మునగపాక దళితవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు మాట్లాడుతూ షెడ్యూల్ కులాలను రిజర్వేషన్ వర్గీకరణ పేరుతో విడగొట్టి కొన్ని రాజకీయ పార్టీలు ప్రయోజనం పొందాలని చూస్తున్నాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూల్ కులాల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటూ చెప్పడం తప్ప ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో దళితనాయకులు కోనపల్లి రామ్మోహనరావు, దిమ్మల నూకరాజు, బీలా శివ గణేష్, ఎం.ప్రసాద్,దిమ్మల శివ, ఎం.మహేష్, సీతారామ్, రామకృష్ణ, అప్పారావు,లోకేష్ పాల్గొన్నారు.

ఊరూ వాడా ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

మది నిండా.. మువ్వన్నెల జెండా

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఊరూవాడా మువ్వన్నెల పతాకం రెపరెలాడింది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తితో జెండా పండగలో పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు జాతీయ పతాకావిష్కరణతో పాటు, రంగుల జెండాలతో కళకళలాడాయి. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా పేరిట ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేసి ప్రజలు గౌరవ వందనం చేశారు. దేశ భక్తిని చాటుకున్నారు.



రింగ్‌రోడ్డు జనసేన ఆఫీస్‌లో పతాకావిష్కరణ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



ఆర్ఏఆర్ఎస్‌లో పతాకావిష్కరణలో ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు



ఆర్టీవో కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన జిల్లా ఆర్టీవో మనోహర్



తాళ్లపాలెం గాయత్రి స్కూల్ విద్యార్థుల వేషధారణలు



కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగికి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ



సీపీఎం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న లోకనాథం



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సాహసాలు

అనకాపల్లి: పట్టణ, మండలంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

- ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులను గుర్తు చేశారు.
- ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తుల గురించి వివరించారు. సీపీఎం నాయకులు, గంటా శ్రీరామ్, ఆర్. శంకరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం వ్యవసాయంలో స్వయం సమృద్ధి సాధించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, కర్షకులు, రైతు కూలీలు సమష్టి కృషి చేయాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కొన్నేళ్ల కృషి ఫలితంగా జాతీయ స్థాయిలో మంచి వంగడాలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడాది అరుంధతి చెరకు రకాన్ని విడుదల చేసామని, ఈ ఏడాది 2006ఎ223 రకాన్ని విడుదల చేస్తామన్నారు. పోస్ట్ హార్వెస్ట్ యూనిట్ ద్వారా నాలుగు కొత్త పేటెంట్లు సమర్పించినట్లు తెలిపారు.
- రింగ్‌రోడ్డులోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.
- గవరపాలెంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ స్కూల్లో కరెస్పాండెంట్ శేశెట్టి గిరీష్‌కుమార్ త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించి, చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.
- మండలంలోని మామిడిపాలెం హైస్కూల్లో హెచ్‌ఎం శ్రీధర్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.
- మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. గాంధీజీ చిత్రపటానికి ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధుల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఎంపీడీవో ప్రశంసా పత్రాలను అందించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.
- భీమునిగుమ్మం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు చెవ్వేటి అప్పారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కట్టుమూరి మంగరాజు, కొల్లిచిన్న అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మెయిన్‌రోడ్డు దిశ పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రజా రాజకీయ వేదిక కార్యాలయంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయివెంకటలక్ష్మణ్ త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రజారాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో మహాత్మా గాంధీజీ విగ్రహానికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మార్కెట్ యార్డులోని వివిధ సంఘాల సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు మణి, గరికి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద మార్కెట్ యార్డు వాకర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డీడీ నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- మండలంలోని కేఎన్నార్ పేట జిల్లా రవాణాశాఖ(ఆర్టీవో) కార్యాలయంలో ఆర్టీవో మనోహర్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
- గవరపాలెం మహాత్మా జ్యోతీరావ్‌పూలే గురుకులంలో ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు.
- జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్ ఆవరణలో హెచ్‌ఎం బ్రహ్మాజీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, సంస్థల్లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

- మండల పరిషత్ కార్యాలయం వద్ద, పీహెచ్‌సీలో ఎంపీపీ కలగా లక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. విద్యార్థులు దేశ భక్తి గీతాలు ఆలపించారు. ఎంపీడీవో కె.శేషుబాబు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, ఏవో ఎ.ఎ.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.
- తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎం.వినోద్ బాబు జెండా ఆవిష్కరించారు.
- స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి రమేష్‌తోపాటు సర్పంచ్ మంత్రి జయరజని జెండా ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు.
- స్థానిక బాలికల హైస్కూల్లో హెచ్‌ఎం ఎం.ఎ స్.స్వర్ణకుమారి, డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం ఆచంట రవి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.
- కశింకోట బాలుర ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్న యువ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రేజేటి మారుతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బహుమతులను అందించారు.
- స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేసిన విన్యాసాలు, నాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.
- కశింకోట, తాళ్లపాలెం గ్రంథాలయాల్లో గ్రంథాలయాధికారులు కె.వరలక్ష్మి, కె.జగన్నాథం ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించి, పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.
- తాళ్లపాలెం గాయత్రి స్కూల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశ నాయకుల వేషధారణ ఆకట్టుకుంది. కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ వైనగేష్ పాల్గొన్నారు.
- జి.భీమవరం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు జెండా ఎగుర వేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.
- తేగాడలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, తాళ్లపాలెం గురుకుల పాఠశాల, ఇతర పాఠశాలలు, సంస్థల్లో కూడా స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.



గవరపాలెంలో జెండా ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ స్కూల్లో.. శేశెట్టి గిరీష్‌కుమార్



మామిడిపాలెం హైస్కూల్‌లో విద్యార్థుల విన్యాసం



ఆర్ఏఆర్ఎస్‌లో విద్యార్థుల విన్యాసాలు



ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు



భీమునిగుమ్మం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న అప్పారావు



అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ



డీపీఎన్ హైస్కూల్లో జెండా ఆవిష్కరణ



బీజేపీ జిల్లా కార్యాలయంలో జెండా ఎగురవేసిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు



మహాత్మా జ్యోతీరావ్ పూలే గురుకులంలో జెండాను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు



కశింకోట గ్రంథాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ అధికారి వరలక్ష్మి



కశింకోట బాలికల హైస్కూల్ ఆటల పోటీల విజేతలకు బహుమతుల అందజేత



కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థుల విన్యాసాలు

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 61 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-36 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 322 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 304 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

థింసా నృత్యంతో తృతీయ బహుమతి



జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకల్లో థింసా నృత్యంతో తృతీయ బహుమతి పొందిన బాలికల హైస్కూల్ విద్యార్థులు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో థింసా నృత్యం ప్రదర్శించి, తృతీయ బహుమతి అందుకున్నారు. జిల్లా స్థాయి వేడుకల్లో భాగంగా 22 మంది విద్యార్థుల బృందం పాల్గొని థింసా నృత్యాన్ని ప్రదర్శించి, అలరించారు. వీరి ప్రదర్శనను అభినందించి హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ జ్ఞాపికతోపాటు, ప్రశంసా పత్రం అందించారు. ఈ నేపథ్యంలో వీరిని పాఠశాలలో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.

వారపు సంతకు శ్రావణ శోభ

కశింకోట: స్థానిక వారపు సంతకు గురువారం వరలక్ష్మి కళ సంతరించుకుంది. శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం నేపథ్యంలో ప్రజలు సంతకు ఎక్కువ సంఖ్యలో తరలి వచ్చారు. వ్రతానికి అవసరమైన పూజా ద్రవ్యాలు, పండ్లు, పత్రులు, చీరలు, రవికెలు, కూరగాయలు వగైరా సరకులు కొనుగోలు చేశారు. దీంతో ఆయా దుకాణాలు కిక్కిరిశాయి. కొనుగోలుదారులతో సంత కళకళలాడింది.



కశింకోటల వారపు సంత కళకళ

మునగపాక పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ



పోలీసు స్టేషన్ ఆవరణ పరిశీలిస్తున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

మునగపాక:మునగపాక పోలీసు స్టేషన్‌ను గురువారం పరవాడ డీఎస్పీ సత్యనారాయణ సందర్శించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన పలు కేసులకు సంబంధించి విడిపించుకోలేని వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ప్రాంగణం ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలన్నారు. 17వ తేదీన జరగనున్న స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ పి.ప్రసాదరావు,ఏఎస్ఐ మన్మథరావు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు దక్కిన ప్రశంస

78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సేవా పురస్కారాలను అందుకున్నారు. ఈ మేరకు వారికి హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ రమేష్, కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

\- అనకాపల్లి



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న అనకాపల్లి ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌కుమార్, 10వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ వద్దాది వెంకటరమణ, ఇంటెలిజెన్స్ జోనల్ ఇన్‌స్పెక్టర్ అడ్డాల చంద్రశేఖరరావు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో అలంకరణ



పొలంబడిలో మేలైన యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ తెలిపే స్టాల్

అమ్మో..యిలేనా..!



అమ్మాయిలంటే అబలలు కాదు.. ఏ స్థాయి సాహసాలకైనా వెనుకాడని యోధులని కశింకోటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు చాటిచెప్పారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులు చేసిన విన్యాసాలు ఆహూతుల ఒళ్లు గగుర్పొడిచాయి. శివంగుల్లా ఒకరిపైనుంచి ఒకరు దూకుతూ.. ఒకరిపై ఒకరు చేరి పిరమిడ్ ఆకృతిలో ఏర్పడి, ఆకట్టుకున్నారు.

\-కశింకోట